నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
03.
11 సెప్టెంబర్ 2024
పేజీలు 8


**సృజన్‌శిఖర్ పురస్కారం**

కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు సృజన్‌శిఖర్ పురస్కారం లభించింది. వారణాసికి చెందిన ప్రముఖ సాహిత్య సంస్థ నాందీ సేవా న్యాస్ సమితి ఏటా ప్రముఖ సాహితీవేత్తలను ఈ పురస్కారంతో సన్మానిస్తుంది. వారణాసిలో జూన్ 26న జరిగిన హిందీ సాహితీవేత్త రాజేంద్రప్రసాద్ పాండే స్మారక సాహిత్య కార్యక్రమంలో ఈ పురస్కారంతో పాటు రూ.లక్ష నగదు అందజేశారు.

# ఉద్యమానికి ఊపిరి.. సాంస్కృతిక ప్రతీకలు - విద్యార్థులు

**మలిదశ ఉద్యమంలో ప్రచారంలోకి వచ్చిన సాంస్కృతిక ప్రతీకల గురించి చర్చించండి?**

- 1996 నుంచి సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఎంతో ప్రాధాన్యం లభించింది. ఈ క్రమంలో తెలంగాణ మేధావులు, రచయితలు, కళాకారులు, ఉద్యమకారులు కొన్ని సాంస్కృతిక ప్రతీకలను ముందుకు తెచ్చి వాటిని ఉద్యమ వాహికలుగా ఉపయోగించారు.
- మలిదశ ఉద్యమంలో తెలంగాణ సంస్కృతిలో కీలక పాత్ర పోషించే బొడ్డెమ్మ, బతుకమ్మ, బోనాలు వంటి అంశాలను ప్రతీకలుగా ఉపయోగించడం ఎక్కువైంది. తెలంగాణ జాగృతి సంస్థ బతుకమ్మను బలమైన ప్రతీకగా వెలుగులోకి తెచ్చింది. బతుకమ్మ ద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని చాటడం, సీమాంధ్ర పాలనలో తెలంగాణ చెరువులు ఎలా పతనమయ్యాయో తెలిపారు. ఉద్యమంలోని అనేక కీలక సందర్భాల్లో బతుకమ్మకు ప్రచారం కల్పించారు.
- తెలంగాణ ఉద్యమంలో సృష్టించిన మరో బలమైన ప్రతీక తెలంగాణ తల్లి. బీఎస్ రాములు, దుర్గం రవీందర్, కేసీఆర్ తదితరుల సూచనలతో బీవీఆర్ చారి, గంగాధర్, పసునూరి దయాకర్ వంటి కళాకారుల కృషితో తెలంగాణ తల్లి రూపొందింది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా, వైభవాన్ని చాటేలా, సుసంపన్నమైనరీతిలో భవిష్యత్తు బంగారు తెలంగాణకు సూచికగా తెలంగాణ తల్లిని రూపొందించారు.
- తెలంగాణ అమరవీరుల స్థూపం కూడా ఒక బలమైన ప్రతీకగా వినియోగించారు. 1969 ఉద్యమంలో అమరులైన వారిని స్మరిస్తూ గన్‌పార్క్ వద్ద 1970–71 మధ్య నిర్మించిన స్థూపానికి మలిదశ ఉద్యమంలో విస్తృత ప్రచారం లభించింది. ఆ నాటి స్ఫూర్తిని, గతకాలపు త్యాగాలను స్మరించుకుంటూ ఉద్యమ గమనంలో ఎన్నో ర్యాలీలు, ప్రదర్శనలు, పాదయాత్రలకు ఈ స్థూపం వేదికగా, గమ్యంగా నిలిచింది.
- పది జిల్లాల తెలంగాణ చిత్రపటం కూడా మలిదశ ఉద్యమంలో బలమైన ప్రతీకగా వినియోగించారు. టీఆర్ఎస్ తన పార్టీ జెండాలోనే తెలంగాణ చిత్రపటాన్ని ఉంచి తెలంగాణ ప్రజానీకానికి లక్ష్య స్ఫూర్తిని కలిగించింది.
- ఉద్యమకాలంలో జై తెలంగాణ నినాదం కూడా విస్తృత ప్రచారం పొందింది. తెలంగాణ వాదులు ఒకరికొకరు జై తెలంగాణ నినాదంతో పలకరించుకోవడం, వీడుకోలు చెప్పుకోవడం చేశారు.
- మలిదశ ఉద్యమంలో తెలంగాణ చరిత్ర నుంచి ఎందరో విశిష్ట వ్యక్తులను గ్రహించి బలమైన సాంస్కృతిక ప్రతీకలుగా వినియోగిస్తూ విభిన్న సామాజిక వర్గాలను ఉద్యమం వైపు నడిచేలా చేశారు. తెలంగాణ ఆదివాసీల పోరాటాలకు స్ఫూర్తిగా కుమ్రం భీం, బడుగు బలహీన వర్గాల పోరాట ప్రతీకలుగా సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మలను, తెలంగాణ పోరాటంలో ముస్లింల పాత్రను గుర్తుకు తెస్తూ బందగీ, షోయబుల్లా ఖాన్ ప్రతీకలుగా వినియోగించారు. అలాగే రుద్రమ దేవి, సమ్మక్క–సారక్క, చాకలి ఐలమ్మలను మహిళా శక్తికి ప్రతీకలుగా వినియోగించి మహిళలను ఉద్యమంలోకి వచ్చేలా చేశారు.




**మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్రను వివరించండి?**

- తెలంగాణ చరిత్రలో విద్యార్థులు కీలకపాత్ర పోషిస్తూ వచ్చారు. 1938 వందేమాతరం ఉద్యమం, 1952 ముల్కీ ఉద్యమంలో విద్యార్థులే కీలక పాత్ర పోషించారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ విద్యార్థులే వీరోచితంగా పోరాడారు. అమరులైన వారూ ఉన్నారు. 1990 దశకంలో మొదలైన మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ విద్యార్థులే కీలక పాత్ర పోషించారు. తెలంగాణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసి ఉద్యమానికి ఊపిరి పోశారు.
- ఆరు సూత్రాల పథకాన్ని అనుసరించి విద్యాసంస్థల్లో అక్రమంగా స్థానికేతర అభ్యర్థులకు రిజర్వేషన్ కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ లిబరేషన్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆందోళన చేసింది. అలాగే సీమాంధ్ర అధ్యాపకులను డిప్యూటేషన్‌పై తెలంగాణకు బదిలీ చేసినప్పుడు విద్యార్థులు ఉద్యమించడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.
- తెలంగాణ జనసభ, తెలంగాణ మహాసభ, తెలంగాణ ఐక్యవేదిక తదితర సంస్థలు నిర్వహించిన కార్యక్రమాలు అన్నింటిలోనూ విద్యార్థులు పాల్గొని తెలంగాణ వాదంపై అవగాహన పెంచుకుని ఉద్యమం పట్ల నిబద్ధులయ్యారు.
- 1990 దశకంలో టీడీపీ ప్రభుత్వం అనుసరించిన సరళీకృత విధానాల వల్ల తెలంగాణలో నిరుద్యోగం తాండవించింది. మరోపక్క కార్పొరేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా సాగించిన దోపిడీ విద్యార్థులకు ఆగ్రహాన్ని తెప్పించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడితేనే తమ భవిష్యత్తుకు భరోసా ఉంటుందని భావించి ఉద్యమంలో మమేకమయ్యారు.
- 2004లో జరిగిన ఫ్రీ జోన్ వ్యతిరేక ఆందోళనలో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. కేసీఆర్ దీక్ష సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంతేకాకుండా ఓయూ విద్యార్థులు జేఏసీగా ఏర్పడి ఉద్యమాన్ని ఉద్ధృతం చేశారు. అప్పటి నుంచి ఓయూ ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా మారింది. తదనంతర కాలంలో ఏర్పడిన జేఏసీలకు ఓయూ జేఏసీ దారి చూపింది.
- కేసీఆర్ దీక్షకు మద్దతుగా కొంతమంది విద్యార్థుల బలిదానాలు కేంద్రంపై ఒత్తిడి పెంచి డిసెంబర్ 9 ప్రకటినకు దారితీసింది. ఓయూ విద్యార్థులు డిసెంబర్ 10న చేపట్టాలనుకున్న 'చలో అసెంబ్లీ' కార్యక్రమం ప్రభుత్వాన్ని భయపెట్టింది. ఆ కార్యక్రమం జరిగితే పరిస్థితులను అదుపు చేయలేమని ప్రభుత్వం భయపడింది. ఒక విధంగా డిసెంబర్ 9 ప్రకటనకు ఈ భయం కూడా ఒక కారణం.
- 2009, డిసెంబర్ 23న కేంద్రం తెలంగాణపై వెనుకంజ వేయడంతో విద్యార్థులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో 2010, జనవరి 3న ఓయూలో విద్యార్థి గర్జన నిర్వహించాలనుకున్నారు. పోలీసులు అనుమతి నిరాకరించడంతో విద్యార్థులు హైకోర్టుకు వెళ్లి షరతులతో కూడిన అనుమతులు పొంది ఈ సభను నిర్వహించారు.

**మలిదశ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్రను విశ్లేషించండి?**

- ఆంధ్రప్రదేశ్ అవతరించాక క్రమంగా గోల్కొండ వంటి తెలంగాణ పత్రికలు కనుమరుగయ్యాయి. సీమాంధ్ర యాజమాన్యంలోని కొన్ని పత్రికలు విస్తృత ప్రచారాన్ని పొంది తొలంగాణ అణచివేత సాధనాలుగా పని చేశాయి.
- ఈ ప్రసార సాధనాల్లో తెలంగాణ విలేకరులు అణచివేతకు, అవమానాలకు గురవుతూ వచ్చారు. దాంతో వారిలో కూడా తెలంగాణ సోయి మొదలయ్యింది. ఈ క్రమంలో మలిదశ ఉద్యమంలో జర్నలిస్టులు క్రియాశీల పాత్ర పోషించారు.
- 2001, మే 31న బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో అల్లం నారాయణ, ఎన్ వేణుగోపాల్ తదితరుల ఆధ్వర్యంలో 'తెలంగాణ జర్నలిస్టుల ఫోరం' ఏర్పడింది. అప్పటి నుంచి తెలంగాణ జర్నలిస్టులు ఉద్యమ గమనం పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ వచ్చారు. 2009లో కేసీఆర్ దీక్ష సందర్భంగా జర్నలిస్టులు క్రియాశీల పాత్ర పోషించారు. డిసెంబర్ 23 ప్రకటన తర్వాత తెలంగాణ అంతటా వెల్లువెత్తిన ప్రజా నిరసనలో జర్నలిస్టులు కూడా భాగమయ్యారు.
- 2010, ఫిబ్రవరి 15న ఓయూలో విద్యార్థులపై పోలీసుల దాడి సందర్భంగా ఆ దృశ్యాలను చిత్రీకరిస్తున్న మీడియాపై దాడి జరగడంతో మీడియా ప్రతినిధులు ధర్నాకు దిగారు. 2010, ఏప్రిల్ 22న వెంటనే బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ 'తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు' అనే పేరుతో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేశారు.
- 2010, అక్టోబర్ 4న తెలంగాణ ఏర్పాటును కోరుతూ హైదరాబాద్‌లో మీడియా మార్చ్ నిర్వహించింది. 2010, డిసెంబర్ 5న జర్నలిస్టులు గన్‌పార్క్ నుంచి ఆర్‌టీసీ కళాభవన్ వరకు భారీ ర్యాలీ చేపట్టి, తెలంగాణ పాత్రికేయుల మహాసభ నిర్వహించారు.
- శ్రీకృష్ణ కమిటీ నివేదికలోని 8వ అధ్యాయంలో మీడియా మేనేజ్‌మెంట్ కొన్ని సూచనలు చేశారు. ఉద్యమ వార్తలను విస్తృతంగా ప్రచారం చేయడంతో తెలంగాణ జర్నలిస్టుల పాత్రను ప్రస్తావిస్తూ వారిని కట్టడి చేయాలని సూచించారు. దీంతో ఆగ్రహించిన పాత్రికేయులు 2011, మే 19న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశారు.
- 2010, అక్టోబర్ 30న తెలంగాణ జర్నలిస్టులపై వివక్షను వ్యతిరేకిస్తూ సుందరయ్య పార్క్ నుంచి ఇందిరా పార్క్ వరకు ఆత్మగౌరవ ర్యాలీని నిర్వహించారు. అలాగే వీ6, హెచ్ఎం టీవీ, టీ న్యూస్, నమస్తే తెలంగాణ వంటి సంస్థలపై ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా జిల్లాల్లో ధర్నాలు, రాస్తారోకోలు జరిగాయి.
- ఉద్యమ వార్తలను ఎప్పటికప్పుడు బాహ్య ప్రపంచానికి చేరవేసి ఉద్యమ వేడిని పెంచడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారు. అనేక సందర్భాల్లో పోలీసుల లాఠీలను లెక్క చేయకుండా ఉద్యమ వార్తలను చిత్రీకరించారు. పత్రికల్లో ప్రత్యేక శీర్షికలు నిర్వహించి తెలంగాణ ఉద్యమాన్ని బలపరిచారు. హెచ్ఎం టీవీ నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ దశ–దిశ' కార్యక్రమం తెలంగాణ ఉద్యమానికి దోహదపడింది.

- 2010, జనవరి 19న ఉద్యమాన్ని బలపరుస్తూ ఓయూ విద్యార్థి వేణుగోపాల్ రెడ్డి ఆత్మబలిదానం చేసుకున్నాడు. విద్యార్థులు నిర్వహించ తలపెట్టిన అంతిమయాత్ర ఉద్రిక్తంగా మారింది. ఆ తర్వాత కూడా ఎందరో విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు.
- 2010, జనవరి 23న ఏబీవీపీ నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో విద్యార్థి రణభేరి నిర్వహించారు. బీజేపీ నాయకురాలు సుష్మా స్వరాజ్ ఈ సభకు హాజరై తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
- 2010, ఫిబ్రవరి 3న శ్రీకృష్ణ కమిటీని నియమించడంతో విద్యార్థులు నిరసనగా పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర ముగింపు సభ ఫిబ్రవరి 7న కాకతీయ యూనివర్సిటీలో పొలికేక పేరుతో జరిగింది.
- రాజకీయ నాయకులు రాజీనామా చేయకుండా ఉద్యమ ద్రోహం చేస్తున్నారని భావించి విద్యార్థులు 2010, ఫిబ్రవరి 20న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టాలనుకున్నారు. ఎన్నో ఆంక్షలు విధించినప్పటికీ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో సిరిపురం యాదయ్య అనే విద్యార్థి ఆత్మబలిదానం చేసుకున్నాడు.
- ఓయూ నుంచి పోలీస్ బలగాలను ఉపసంహరించుకోవాలని చేసిన ఆందోళన హైకోర్టు దృష్టికి వెళ్లింది. 2011, జూలై 11, 14 తేదీల మధ్య ఓయూలో విద్యార్థులు సామూహిక నిరాహార దీక్షలు చేశారు. తెలంగాణ జేఏసీ పిలుపు అందుకుని సాగరహారం, సకల జనుల సమ్మె తదితర నిరసన కార్యక్రమాల్లోనూ విద్యార్థులు కీలక పాత్ర పోషించారు.

**మలిదశ ఉద్యమంలో మేధావుల పాత్రను వర్ణించండి?**

- 1990 దశకంలో తెలంగాణ ఉద్యమాన్ని పునరుజ్జీవింపజేయడంలో మేధావులు కూడా కీలక పాత్ర పోషించారు. ప్రొఫెసర్లు జయశంకర్, కేశవరావు జాదవ్, కోదండరాం, లక్ష్మణ్, హరినాథ్ తదితర మేధావులు ఎన్నో వేదికల ద్వారా, రచనలు, వ్యాసాల ద్వారా తెలంగాణ సమస్యలపై అవగాహన పెంచుతూ మలిదశ ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారు.
- 1969 ఉద్యమంలో భావజాలాన్ని ప్రచారం చేసే సాహిత్యం లేకపోవడం ప్రధాన లోపంగా ఉంది. ఈ లోపాన్ని అధిగమించి మలిదశ ఉద్యమ కాలంలో మేధావులు తెలంగాణ సమస్యలపై ఎన్నో విస్తృతమైన రచనలు చేశారు. గాదె ఇన్నయ్య 'దగా పడ్డ తెలంగాణ', జయశంకర్ సార్ 'తెలంగాణలో ఏమి జరుగుతుంది' అనే రచనలు తెలంగాణ ఉద్యమం, సమస్యలపై గణాంకాలతో కూడిన విశ్లేషణ చేశాయి.
- ప్రొ. సింహాద్రి, ప్రొ. విశ్వేశ్వరరావుల సంపాదకత్వంలో వెలువడిన 'తల్లడిల్లుతున్న తెలంగాణ' తెలంగాణ సమస్యలను, విభిన్న కారణాలను ఆవిష్కరించింది.
- భువనగిరి సభ, సూర్యాపేట డిక్లరేషన్, వరంగల్ డిక్లరేషన్ తదితర అంశాల ద్వారా మేధావులెందరో తెలంగాణ రాష్ట్ర అవశ్యకతను తెలియజేశారు.
- 2004లో కోదండరాం ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ విద్యావంతుల వేదిక సాగునీటి రంగంలో, ఉపాధి, విద్య, పరిశ్రమలు తదితర రంగాల్లో తెలంగాణ ఎదుర్కొంటున్న వివక్షను ప్రచారం చేసింది. గల్ఫ్ బాధితుల సమస్యలు, బీడీ కార్మికుల సమస్యలు, పాలమూరు వలసల గురించి చర్చ లేవనెత్తించింది.
- తెలంగాణ టీచర్స్ ఫోరం, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం, పీపుల్స్ ఫౌండేషన్ ఆఫ్ తెలంగాణ వంటి వేదికల ద్వారా విద్యావంతులెందరో ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారు.
- మేధావులెందరో పత్రికలు, టీవీ చానళ్లతో, రచనల ద్వారా, విశ్లేషణల ద్వారా ఉద్యమానికి తోడ్పడ్డారు. ఘంటా చక్రపాణి, వీ ప్రకాష్, జ్వాలా నర్సింగరావు, ప్రొ. కే నాగేశ్వర్, చుక్కా రామయ్య తదితరులెందరో ఈ దిశగా కృషి చేశారు. తెలంగాణ జేఏసీ కార్యక్రమాల్లోనూ మేధావులు పాల్గొని తమ వంతు కృషి చేశారు.

ప్రకాశ్
ఏమర్స్ విల్
హైదరాబాద్

